విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ఈడుపుగల్లు గ్రామంలో ఆదివారం ఆయన స్వగృహం వద్ద మేరుగు విజయకుమార్ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీఐ సీనియర్ నాయకుడు వెలగపూడి ఆజాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ విజయ్‌కుమార్ తల్లిదండ్రులు ఉపాధ్యాయులుగా పనిచేస్తూ కమ్యూనిస్టు భావజాలంతో కుమారుడ్ని కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షింపజేశారన్నారు. విజయకుమార్ పిన్నవయసులోనే ఈడుపుగల్లు సర్పంచ్‌గా 1981లో ఎన్నికయ్యారని... రెండుసార్లు ఎంపీటీసీ సభ్యునిగా సేవలందించారని తెలిపారు.

ఎన్నికల కేసులు పూర్తి చేసి ఛార్జిషీట్ దాఖలు చేయాలి : ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులన్నీ త్వరితగతిన విచారణ పూర్తి చేసి, చార్జిషీట్ దాఖలు చేయాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) వెంకటేశ్వరరావు, ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్‌వి డి ప్రసాద్ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటినుండి ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎలక్షన్ ఆధారితంగా నమోదైన ప్రతి ఒక్క కేసును క్షుణ్ణంగా పరిశీలించాలని, ఆ కేసుపై డీఎస్పీ స్థాయి అధికారి ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండాలని, సాధ్యమైనంతవరకు కేసులన్నీటి యొక్క విచారణ త్వరగా పూర్తి చేయాలన్నారు. నేరానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా వారికి చట్ట ప్రకారం శిక్షపడేలా చేయడంలో ప్రతి ఒక్కరు ప్రత్యేక భూమిక పోషించాలని ఎస్పీ సూచించారు. అందరి తోడ్పాటుతో ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశామని, అలాగే కౌంటింగ్ లో కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేలా ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలని, ఎన్నికల కోడ్ నియమ నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించిన వారిపై చర్యలు ఉపక్రమించాలని అన్నిటికీ ముందస్తుగా సిద్ధంగా ఉండాలని తెలిపారు.

విద్యార్థులకు సత్కారం

విశాలాంధ్ర-పమిడిముక్కల: గ్రామాల్లో చదువులో మంచి మార్కులు సాధించే ఉత్తమ విద్యార్థులను ఐనంపూడిలో శ్రీకృష్ణదేవరాయ గ్రామాభివృద్ధి కమిటీ ఘనంగా సత్కరించారు. స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల చదువులకు సమస్యలు అడ్డురాకూడదని వారి ప్రోత్సాహించేతే ఇష్టం గా చదువుతారని అన్నారు.గ్రామాభివృద్ధి కమిటీ చేసే విధానం భవిష్యత్తులో అందరికీ ఆదర్శం గా ఉంటుందని కమిటీ సభ్యులను అభినందించారు.ఈ సందర్భంగా ఇటీవల పదవ తరగతి ఫలితాల లో ప్రతిభ కనబరిచిన లక్ష్మీ ప్రియాంక కి రూ.5 వేల, బోల్లా మోహన అనుకి రూ.3 వేలు నగదు జ్ఞాపిక బహుకరించారు. గ్రామంలో విశ్రాంత ఉద్యోగులు 21 గురు శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ యేనుగ బేబి కమిటీ అధ్యక్షుడు కొల్లి వెంకట ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ శీలం మురళి, కార్యదర్శి శీలం రమేష్ , కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌లు నిర్వహిస్తే చర్యలు

విశాలాంధ్ర-పమిడిముక్కల: ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు పై గ్రామాల్లో బెట్టింగ్ లు నిర్వహిస్తే ఆ వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం కపిలేశ్వరపురం లో ప్రజలతో మమేకమైన మాట్లాడుతూ ప్రత్యర్థులను రెచ్చకోట్టే సంఘటనలకు పాల్పడవద్దని వదంతులు నమ్మవద్దని తమకు అత్యవసర సమయాల్లో 100కి ఫోన్ చేస్తే వేంటనే స్పందిస్తానని ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంతత ఉండాలని ప్రజలకు హితబోధ చేశారు.

తాడంకి అనధికార లేఅవుట్లపై నివేదిక ఇవ్వండి

విశాలాంధ్ర-పమిడిముక్కల : తాడంకి గ్రామంలో అనధికార లేఅవుట్లు పై ఆంధ్ర ప్రదేశ్ సి.ఆర్.డి.ఎ. కమీషనర్ ని రాష్ట్ర ఉప లోకాయుక్త నివేదిక ఇవ్వాలని కోరిందని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస గౌడ్ తెలిపారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ సదరు గ్రామం లో 150/1బి లో ఎ.2-065 లు ఎలాంటి అనుమతులు లేకుండా లేఅవుట్లు వేశారని క్రయవిక్రయాలు జరగకుండా జిల్లా రిజిస్ట్రార్ తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప లోకాయుక్త కి ఫిర్యాదు చేయగా సిఆర్డిఎ కమీషనర్ ని సమగ్ర నివేదిక ఇవ్వాలని ఉప లోకాయుక్త పగిడి రజిని ఉత్తర్వు జారీ చేశారని జంపాన తెలిపారు.

'ఆళ్ల'కు 'యార్లగడ్డ పరామర్శ

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలో ఓటమి భయంతోనే పోలింగ్ రోజున వైసీపీ శ్రేణులు కొత్తమల్లవల్లితో సహా అనేక గ్రామాల్లో టిడిపి నాయకులు పై దాడులు చేశారని, టిడిపి నేతలపై దాడిచేయటం హేయం అని గన్నవరం నియోజకవర్గం ఎన్డీఏ కూటమి టిడిపి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఇటీవల కొత్త మల్లవల్లిలో జరిగిన ఎన్నికల సందర్భంగా వైసీపీ శ్రేణుల దాడికి గురైన రాష్ట్ర టిడిపి నేత ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావును రంగన్నగూడెంలో ఆయన నివాసంలో ఈరోజు టిడిపి నాయకులతో కలిసి పరామర్శించారు. దాడికి సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రంగన్నగూడెం నుంచి యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ... శాసనసభ ఎన్నికలలో పోలింగ్ రోజున అసెంబ్లీ టిడిపి అభ్యర్థి అయిన నాకు, పార్లమెంట్ జనసేన అభ్యర్థి అయిన బాలసౌరి కి ఓటర్ల నుండి విపరీతమైన సానుకూల స్పందన ఉందని, అందువల్లే వైసీపీ శ్రేణులు ఈర్ష్యాఅసూయలతో దాడులు చేశారని, నియోజకవర్గంలో పోలింగ్ రోజున నాలుగైదు గంటలు నిలబడి ఎంతో సహనంతో ఓటర్లు ఓటు వేశారని దానివల్ల 84.80% పోలయ్యిందని, గన్నవరం నుంచి నాకు, మచిలీపట్నం పార్లమెంటు ఎన్డీఏ కూటమి జనసేన అభ్యర్థి వల్లభనేని బాలసౌరికి మంచి మెజార్టీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. . ఈ కార్యక్రమంలో రంగన్నగూడెం గ్రామ సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు తుమ్మల ధశరధరామయ్య, ఎంపీసీఎస్ అధ్యక్షులు మొవ్వ శ్రీనివాసరావు, గ్రామ టిడిపి అధ్యక్షులు మొవ్వ వేణుగోపాల్, గ్రామ తెలుగు మహిళాఅధ్యక్షురాలు దోనవల్లి నాగశిరోమణి, మండల టిడిపి నాయకులు తుమ్మల ఉదయ్, కొండపల్లి వెంకటేశ్వరరావు, గండేపూడి నితీష్ కుమార్, స్థానిక టిడిపి నాయకులు పల్లగాని వీరాంజనేయులు, గరికపాటి శంకర్, కళ్ళే వెంకటేశ్వరరావు, బెజవాడ వెంకటకృష్ణారావు, కనకవల్లి శేషగిరిరావు, మందపాటి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్, డిజిల్ లూజుగా విక్రయిస్తే చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : జిల్లాలో సాధారణ ఎన్నికలకు సంబంధించి వచ్చే నెలజూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు కార్యక్రమం సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా సురక్షితంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించే నిమిత్తం జూన్ 6 వ తేదీ ఎన్నికల ప్రక్రియ ముగిసేంతవరకు పెట్రోల్ బంక్ యాజమాన్యాలు ఎట్టి పరిస్థితులలో లూజుగా సీసాలలో గాని, కాన్లలో గాని ఇతరత్రా విక్రయించరాదని జిల్లా ఎన్నికల అధికారి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను జిల్లా పౌరసరఫరాల అధికారి గుడివాడ, మచిలీపట్నం, ఉయ్యూరు రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దారులు కచ్చితంగా అమలు అయ్యేలా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి అవతరణలో సూచించారు.

పెట్రోల్, డిజిల్ విడిగా అమ్మితే చర్యలు

విశాలాంధ్ర-కూచిపూడి : కృష్ణా జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల అనంతరం జరుగుతున్న పరిణామాల్లో పెట్రోలు బంకులలో విడిగా పెట్రోల్. విక్రయాలు నిషేధించినట్లు కూచిపూడి ఎస్సై టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం మండలంలోని పెట్రోల్ బంకులతో పాటు గ్రామాలలోని ప్రజలకు సైతం ఈ విషయంపై అవగాహన కల్పించారు. ఎన్నికల అనంతరం జరుగుతున్న ఘర్షణలు అల్లర్లు లాంటిసంఘటనలను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో గల నిడుమోలు, మొవ్వ, కోసూరు లలో గల నాలుగుపెట్రోల్, డీజిల్ బంకులలో టిన్నులు, డ్రమ్ములు, బాటిల్స్ ద్వారా పెట్రోల్ అమ్మకం నిలిపి వేయించామని వివరించారు. మండలంలో గల పెట్రోల్ బంకుల యాజమాన్యం అందరూ జిల్లా అధికారుల ఉత్తర్వులు తప్పకుండా పాటించాలని సూచించారు. ఈ ఉత్తర్వులు అధికమిస్తే ఆయా పెట్రోల్ బంకుల లైసెన్సులు కూడా రద్దు చేయబడతాయని హెచ్చరించారు. మండలంలో ఎవరి వద్దనైనా అనుమానస్పదంగా పేలుడు పదార్థాలు మారణాయుధాలు కలిగి ఉన్న రవాణా చేసిన నిలవ ఉంచిన సదర వ్యక్తులపై సత్తపరమైన కటించారు పేర్కొన్నారు. ఈ విషయంలో గ్రామ పెద్దలు స్పందించి యువతకు దీనికి సంబంధించిన విషయంలో అవగాహన కల్పించి చైతన్యపరిచే అల్లర్లకు దూరంగా ఉంచాలని పేర్కొన్నారు.

ఓట్ల లెక్కింపు వరకు సంయమనం పాటించాలి

విశాలాంధ్ర-కూచిపూడి : జూన్ 4వ తారీఖు నిర్వహించే ఓట్ల లెక్కింపు కార్యక్రమం సందర్భంగా ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో జీవనం సాగిస్తూ ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించి వారి సూచనలు సలహాలు పాటించాలని పామర్రు.సీ.ఐ.వి. సుభాకర్ సూచించారు. ఆయన కూచిపూడి ఎస్సై టి శ్రీనివాస్, సిబ్బంది తో కలిసి సమస్యాత్మక ప్రాంతమైన కాజలో గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించి జాగ్రత్తలు సూచించారు. ఈ రెండు వారాలు గ్రామాలలో ఎన్నికల కోడ్ తో పాటు144 సెక్షన్,క్రైమ్ పీ.సి, సెక్షన్ 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉన్నందున ఏ ప్రాంతంలో కూడా నలుగురు కన్నా ఎక్కువ మంది గుంపుగా ఉండరాదని, ముందస్తు అనుమతులు లేకుండా బహిరంగ సభలో సమావేశాలు ర్యాలీలు నిర్వహించరాదని హెచ్చరించారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులను కానీ కార్యకర్తలను కానీ ఉద్దేశపూర్వకంగారెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయరాదని సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, వదంతులను పెట్టి ప్రచారం చేస్తూ రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే అనుమతులు లేకుండా బాణాసంచా కాలుస్తూ, ఇతర పార్టీ అభ్యర్థుల,కార్యకర్తల ఇంటి ముందు కవ్వించే విధంగా బాణాసంచా కాల్చి రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించిన వారిపై కూడా చట్టపరమైన ఘటన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఎక్కువ శబ్దాలు వచ్చే డీజే సౌండ్ సిస్టం ఏర్పాటు చేసి ఎదుటి వర్గం వారిని రెచ్చగొట్టే విధంగా పాటలు సాహిత్యాన్ని ప్రచారం చేయుట నేరమని అటువంటి వారిపై కేసులు నమోదు చేసి డి.జె. సిస్టంను స్వాధీనం చేసుకుంటామని పేర్కొంటూ గ్రామాలలో ఎవరైనా అనుమానంగా తిరిగినా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా పోలీసులకువెంటనే సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు అలాగే ముందస్తు అనుమతులు లేకుండా గుంపులుగా చేరి ప్రజా జీవనానికి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కూడా చట్టపరమైన చర్యలు ఉంటాయని ఈ స్థితిలో ప్రజలందరూ పార్టీలకు అతీతంగా సహకరించి శాంతిభద్రతలను కాపాడాలని కోరారు. అదేవిధంగా కోసూరు గ్రామంలో కూడా సమావేశాన్ని నిర్వహించి గ్రామస్తులకు ఇచ్చిన సూచనలతో గ్రామాల ప్రజలు సహకరిస్తామని స్పష్టం చేశారు.

అర్చకులు వెంట్రామాచార్యులు మృతి

విశాలాంధ్ర-అవనిగడ్డ :- లక్ష్మీనారాయణ స్వామివారి ఆలయ ప్రధాన అచర్యకులు వైకాశాసగమ పండితులు విశ్రాంత ఉత్తమ ఉపాధ్యాయులు దివి వెంకట్రామాచార్యులు 85 ఆదివారం ఉదయం ఆయన స్వగ్రామంలో కన్ను మూశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత 2 నెలలుగా గుండెకు సంబందించి చికిత్స పొందుతున్నారు. మోపిదేవి మండలం పెద్దకళ్ళేపల్లి మండలంలోని ఉన్నతపాఠశాలలోని ఉపాధ్యాయులుగా సేవలు అందిస్తూ ఓంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చి దిద్దారు. ఆయన ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య నేతగా అర్చక స్వాములకు పెద్ద దిక్కుగా మంచి, చెడులను తెలియచేస్తూ ఆలయ వ్యవస్థ ప్రాముఖ్యతను తెలియచేస్తూ ఉన్నారు. శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, అర్చక సమైఖ్యా జిల్లా అధ్యక్షులు అగ్నిహోరారతం ఫణిగోపాల్ సమైఖ్యా రాష్ట్ర వ్యవస్థాపక కార్యదర్శి టి అనంతాచార్యులు అధ్యక్షులు ఆత్రేయబాబు, ఉపాధ్యాయ సంఘ నేతలు రామాచార్యులు మృతికి ప్రగాఢ సంపాన్ని వ్యక్తం చేశారు.

కొనకళ్లకు పరామర్శ

విశాలాంధ్ర-అవనిగడ్డ:- మాజీ యంపి కృష్ణాజిల్ల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నాయానరావును జిల్లా జనసేనా పార్టీ ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరావు తన కుమారుడితో పరామర్శించారు. నారాయణరావు ఇటీవల అశ్వస్థతకు గురి అయ్యి విజయవాడ రమేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆదివారం మత్తి వెంకటేశ్వరావు తన కుమారుడు రాజీవ్‌తో కలిసి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొని త్వరగా కొలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని కోరారు.

భవిష్యత్ తరాలకు సర్దార్ సామినేని స్ఫూర్తి

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : సర్దార్ సామినేని విశ్వనాథం జగ్గయ్యపేట అభివృద్ధికి అందించిన సేవలు,భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని స్థానిక వైఎస్ఆర్సిపి నేతలు అన్నారు. ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను స్వగృహంలో దివంగత జగ్గయ్యపేట మాజీ సర్పంచ్ ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను తండ్రి కీర్తిశేషులు సర్దార్ సామినేని విశ్వనాథం జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమం లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చదువుకి పేదరికం అడ్డు కారాదు

విశాలాంధ్ర-గన్నవరం : హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో విజయవాడ బషీర్ గారి సహకారంతో ఇంజనీరింగ్ చదువుతున్న సుష్మితకు ఆదివారం నాడు ల్యాప్టాప్ అందించడం జరిగింది. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ మాట్లాడుతూ చదువుకి పేదరికం అడ్డంకి కారాదని అప్పుడే సమా సమాజం ఏర్పడుతుందని ఆయన అన్నారు. చదువుకి పేదరికం ఎటువంటి పరిస్థితులలో అడ్డంకి రాకూడదని ఆయన అన్నారు. గతంలో కూడా కల్పన కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో సహకారం చేసామని వెంకట్ తెలిపారు. దాత బషీర్ కి,హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ కి సుష్మిత తల్లి కల్పన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వరిగడ్డి వామి దగ్ధం

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లిలో పదెకరాల వరిగడ్డి వామి ఆదివారం దగ్ధమైంది. స్థానిక దళితవాడలో కొడాలి సురేష్ బాబుకు చెందిన పది ఎకరాల వరిగడ్డివామి తెల్లవారుజామున అగ్నికి ఆహుతైంది. వరి గడ్డి వామికి నలువైపులా మంటలు అంటుకోవటంతో పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అవనిగడ్డ అగ్నిమాపక అధికారులు సిబ్బందితో కలిసి వచ్చి మంటలను అదుపుచేశారు. పూర్తిగా దగ్ధం కావటంతో మధ్యాహ్నం వరకూ సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదనష్టం లక్ష రూపాయలకు పైగానే ఉంటుందని అంచనా. ప్రమాద కారణాలు స్పష్టంగా తెలియరాలేదు. కావాలనే ఎవరో వరిగడ్డి వామికి నిప్పుపెట్టినట్లు అనుమానిస్తున్నారు.

అన్నదానం

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ : నేటి సమాజంలో సమాజ సేవలో ప్రభుత్వాల కంటే స్వచ్ఛంద సంస్థల పాత్ర ఎంతో కీలకమైంది అని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎల్ ఎస్ ఎస్ వి డి హనుమంతరావు అన్నారు. ఆదివారం లంకిశెట్టి ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో మచిలీపట్నం ముస్తా ఖాన్ పేట దేవుడు తోట ఎస్టీ కాలనీలో 250 మందికి అన్నదాన కార్యక్రమం, పళ్ళు పౌష్టికాహారాన్ని పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ప్రారంభించిన హనుమంతరావు మాట్లాడుతూ లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ ద్వారా ఇతర ప్రాంతాల నుండి దాతలు మచిలీపట్నంలో పలు రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. హైదరాబాద్ సాఫ్ట్వేర్ ఇంజనీర్స్ వర్దినీడి శ్రీకాంత్ లంకిశెట్టి దీప్తి, ఆశ్రిత సహకారంతో ఆకలితో ఉన్న ఎస్టీ కాలనీలో పేదవారికి ఆకలి తీర్చడం దేవుడు సేవతో సమానం అన్నారు. ప్రభుత్వపరంగా ఎస్టీ కాలనీలు డెవలప్ చేయాలని వారికి కేటాయించిన నిధులు క్షేత్రస్థాయిలో వారికి అందే విధంగా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని బాలాజీ కోరారు. కాలేకన్ పేట మున్సిపల్ హైస్కూల్లో ఎస్టీ కాలనీ చెందిన పదవ తరగతి విద్యార్థి 475 మార్కులు సాధించడం మంచి పరిణామమని బాలాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ,లంకిశెట్టి నీరజ, తాడేపల్లి రమేష్, మల్లంపల్లి రామాంజనేయులు బాబు, సీతంశెట్టి పవన్, ఆంజనేయులు, తాడేపల్లి తన్మయి, ఓంకారం తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాంతాల కోసం జీవితాన్ని ఫణంగా సుందరయ్య

విశాలాంధ్ర-గుడివాడ : నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాన్ని ఫణంగా పెట్టిన మహెూన్నత వ్యక్తి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.రఘు అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో పార్టీ సినియర్ నాయకుడు నీలం మురళీకృష్ణ,రెడ్డి అధ్యక్షతన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభను నిర్వహించారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతం కోసం, పేద ప్రజల అభ్యున్నతి కోసం తన కుటుంబాన్ని జీవితాన్ని సైతం త్యాగం చేసిన వ్యక్తి సుందరయ్య అన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా సభ్యులు ఆర్‌సిపి రెడ్డి, సిఐటియు నాయకులు టి.లక్ష్మణారావు నాయకులు బి.వి శ్రీనివాస్, అరుణా, రజనీ, కొండ, తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య నిరాడంబర జీవితం ఆదర్శం

విశాలాంధ్ర-చల్లపల్లి : పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడిగా ఉండి సైకిల్ పై పార్లమెంటుకు వెళ్లిన పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నిరాడంబర జీవితానికి నిదర్శనమనీ, సుందరయ్య జీవితం నేటితరానికి ఆదర్శప్రాయమని సీపీఎం జిల్లా నాయకులు యద్దనపూడి మధు అన్నారు. కమ్యూనిస్టుపార్టీ అగ్రనేత కామ్రేడ్ పుచ్చలపల్లి 39వ వర్ధంతిని స్థానిక గుంటూరు బాపనయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధునిగా, ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకునిగా, కార్మిక నాయకునిగా, పీడిత జనోద్ధారణకై పాటుపడిన త్యాగశీలి అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. తొలుత సీపీఎం పార్టీ సీనియర్ నేత కలపాల దావీదు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారుడు నందేటి శ్రీను గీతాలు ఆలపించారు. సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాతంగి లక్ష్మయ్య, లంకపల్లి సత్యం, గోళ్ల సాంబశివరావు, బళ్లా వెంకటేశ్వరరావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

కాజలో సుందరయ్య వర్ధంతి

విశాలాంధ్ర-కూచిపూడి : భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, పేద ప్రజల ఆశాజ్యోతి సిపిఎం పార్టీ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించిన పుచ్చలపల్లి సుందరయ్య 39 వ వర్ధంతి సందర్భంగా ఆదివారం సిపిఎం పార్టీ మొవ్వ మండల కమిటీ ఆధ్వర్యంలో కాజలో పార్టీ స్థూపం ఆవిష్కరణ తోపాటు సుందరయ్య చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. జిల్లా సిపిఎం పార్టీ కమిటీ సభ్యులు శీలం నారాయణరావు, మొవ్వ,కాజ శాఖ కార్యదర్శులు కాకి రాజశేఖర్, కొడాలి కరుణాకర రావు,పార్టీ నాయకులు సిహెచ్ సుబ్రహ్మణ్యం, బండి గోపాలరావు, ఆర్.మురహరి రెడ్డి, కొడాలిశ్రీనివాసరావు, గ్రామ పెద్దలు మట్టా భాస్కరరావు, గ్రామస్తులు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మొక్కలు నాటిన హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా నేతలు

తొలితరం కమ్యూనిస్టు నేత, పోరాటాల యోధుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వవర్ధంతి సందర్భంగా ఆదివారం కూచిపూడి బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటారు. నేషనల్ యాంటీ క్రైమ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు శామ్యూల్ కిమ్.జె.ఆదేశాల మేరకు కృష్ణాజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి డొక్కు వెంకట్, కార్యదర్శి ఓరుగంటి శ్రీను, కోశాధికారి చిగురుపల్లి సుబ్రహ్మణ్యం ల ఆధ్వర్యంలో కూచిపూడి బస్టాండ్ తో పాటు పలు ప్రాంతాలలో మొక్కలు నాటి పుచ్చలపల్లి సుందరయ్యకి నివాళులర్పించారు.

వర్ల రామయ్య అసత్య ప్రచారాలు మానుకోవాలి : వెలంపల్లి

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): తెలుగుదేశం పార్టీ నాయకుడు వర్ల రామయ్య వైసీపీ పై నిందలు వేయటం మానుకోవాలని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి వెల్లంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ సిఫార్సుల మేరకు పోలీస్ అధికారులను మార్చారని అందువల్లే గొడవలు జరిగాయని ఆయన ఆరోపించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. మాజీ పోలీస్ అధికారైన వర్ల రామయ్య కు ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా అధికారుల బదిలీలు, సస్పెన్షన్లు లాంటివన్నీ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు జరుగుతాయని తెలీదా అని వెల్లంపల్లి ప్రశ్నించారు., రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులు అయిన డీజీపీ , సిఎస్ లు వాటిని అమలు చేస్తారని కూడా తెలియని వర్ల రామయ్య లాంటి నాయకుడు ఉండటం రాష్ట్రానికి పట్టిన దరిద్రమన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా బదిలీలపై ముఖ్యమంత్రి, మంత్రులు నిర్ణయాలు తీసుకోరన్నారు. అధికారులపై నివేదికలను ఎన్నికల కమిషన్ డీజీపిని కోరితే ఆయన నివేదిక ఇచ్చారన్నారు. అధికారులు ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని ముఖ్యమంత్రి జగన్ మీద మోపటం వర్ల రామయ్యకు ఎంత విషయ పరిజ్ఞానం ఉందో తెలుస్తుందన్నారు. ఇలాంటి అజ్ఞానం కలిగిన ప్రతిపక్ష నాయకులు ప్రజలకు ఏం మేలు చేస్తారన్నారు.

ఫోలిక్యులర్ లింఫోమా స్టేజ్-4 చికిత్సలో ఏఓఐ విజయం

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): కానూరులోని అమెరికన్ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఏఓఐ), అత్యంత సవాలుతో కూడిన ఫోలిక్యులర్ లింఫోమా స్టేజ్-4తో ఇబ్బంది పడుతున్న 62 ఏళ్ల వ్యక్తికి విజయవంతంగా చికిత్సను చేసినట్లు వెల్లడించింది. బరువు తగ్గడం గత ఆరు నెలలుగా తీవ్రమైన వెన్నునొప్పి వంటి సమస్యలతో అతను పలు హాస్పిటల్స్ తిరిగారు. ప్రారంభంలో ఇతర ఆసుపత్రులలో పరీక్షలు చేసినప్పుడు, అతని పొత్తికడుపు లో పలు పెద్ద లింప్ నోడ్స్ ఉన్నాయని కనుగొనబడింది. క్షయవ్యాధి ప్రోటోకాల్‌ల క్రింద అతనికి చికిత్స చేశారు. అయినప్పటికీ, నిరంతర సమస్యల కారణంగా, డాక్టర్ సాయికృష్ణ కొల్లూరు వద్ద పరీక్ష చేయించుకోవటం కోసం ఏఓఐకు వచ్చారు. సమగ్ర పరీక్ష లతో పాటుగా బయాప్సీ తో పెద్ద లింప్ నోడ్స్ మరియు ఎముక ప్రమేయంతో ఫోలిక్యులర్ లింఫోమా స్టేజ్-4 వున్నట్లు డాక్టర్ కొల్లూరు నిర్ధారించారు. ఏఓఐ యొక్క మల్టీడిసిప్లినరీ, అధునాతన చికిత్సా విధానాలతో, ఆరు నెలల పాటు ఆరు సైకిల్స్ కీమోఇమ్యునోథెరపీ రోగి చేయించుకున్నాడు. చికిత్సకు రోగి యొక్క ప్రతిస్పందన తమ అంచనాలను మించిపోయిందని మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సాయి కృష్ణ కొల్లూరు అన్నారు. వ్యక్తిగతీకరించిన సంరక్షణ, అత్యాధునిక చికిత్సలను అందించడంలో తమ బృందం యొక్క అంకితభావం కారణంగా, కీమోథెరపీకి అద్భుతమైన ప్రతిస్పందన లభించిందని ఆయన తెలిపారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

మామిడి రైతు ఢమాల్!

మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది... ఆరుగాలం కష్టించి పంట పండిస్తే చేతికొచ్చే సమయానికి వర్షాల రూపంలో పంట చేతికి రాకుండా పోతోంది. వర్షానికి తడిసిన కాయలు పాడై మచ్చలు పడతాయి. ఎక్కువ రోజులు నిల్వ ఉంచే పరిస్థితి ఉండదు. దీంతో పంటను తక్కువ ధరకు అమ్ముతున్నారు. రూ.40వేలు ఉండే టన్ను మామిడి కాయల ధర ఇప్పుడు రూ.20 వేలకు పడిపోయింది. లోడింగ్, అన్‌లోడింగ్, ప్యాకింగ్, రవాణా, స్టోరేజీ చార్జీలు అన్ని కలిపితే సగానికి సగం ధర రాక వ్యాపారులు నష్టపోతున్నారు. వర్షాలతో పూత రాలిపోవడంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు...

- అకాల వర్షాలతో మామిడి రైతులు దిగాలు
- ప్రాభవాన్ని కోల్పోతున్న నున్న మ్యాంగో మార్కెట్
- ధర సగానికి పడిపోవటంతో నష్టపోయిన వ్యాపారులు

విశాలాంధ్ర-విజయవాడ: మామిడి కాయల వ్యాపారంలో ఆసియాలోనే పెద్ద మార్కెట్ నున్న మ్యాంగో మార్కెట్. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మామిడి రైతులకు, వ్యాపారులకు సౌకర్యంగా ఉంటుందనే ఉద్దేశంతో విజయవాడ శివారులో మ్యాంగో మార్కెట్ ఏర్పాటు చేశారు. మామిడి సీజన్‌లో 70 షాపులు ఉన్న ఈమార్కెట్ 24 గంటలూ వచ్చిపోయే లారీలతో రద్దీగా ఉండేది. రానురాను ఈ మార్కెట్ ప్రభావాన్ని కోల్పోతుంది. ఈ మార్కెట్‌కు నూజివీడు, మైలవరం, రెడ్డిగూడెం, విస్సన్నపేట, తిరువూరు మండలాల నుంచి మామిడి రైతులు పంటను ఇక్కడికి తీసుకువస్తారు. జాతీయ, అంతర్జాయ మార్కెట్‌లకు ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తారు. ముఖ్యంగా మనదేశంలో మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాలకు నిత్యం సరుకు రవాణా అవుతుంది. బంగిన్నపల్లి, చెరుకురసాలు, తౌతాపురి, సుందరీ వంటి రకాలు ఈ మార్కెట్ నుంచి ఎక్కువగా ఎగుమతి అవుతాయి. గతంలో ఇక్కడ నుంచి ఎగుమతులు జరిగేవి. ఈ మార్కెట్‌కి సరుకు తీసుకువచ్చి విక్రయించటానికి మార్కెట్ కమిటీకి 2శాతం సెస్ చెల్లించాల్సి ఉండేది. ఇప్పుడు ఆయా మండలాల్లోనే చిన్నచిన్న మండీలు (స్థానిక మార్కెట్)ఏర్పాటు చేశారు. సెస్ చెల్లించాల్సిన అవసరం లేకుండా సరుకును అక్కడి నుంచే నేరుగా ఆయా ప్రాంతాలకు ఎగుమతి చేసుకుంటున్నారు. దీంతో నున్న మార్కెట్ డిమాండ్ పడిపోయింది. తరువాత ఇక్కడ కూడా సెస్ వసూలు చేయటం లేదు. అయినా మామిడికాయులను లారీల్లో తీసుకువచ్చి మళ్లీ లారీల్లో ఎక్కించి పంపించటం సమయం, డబ్బులు వృధా అని భావించి చిన్న మార్కెట్‌ల నుంచి తీసుకెళుతున్నారు. దీంతో నున్న మ్యాంగో మార్కెట్ కళ తప్పింది.

అనుకూలించని వాతావరణం:

ఈ ఏడాది ప్రకృతి మామిడి రైతులపై కన్నెరజేసింది. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ఈదురు గాలులు రావటంతో పూత రాలిపోయింది. దీంతో పంట దిగుబడి బాగా తగ్గింది. గతంలో రోజుకు 500 టన్నుల పంట మార్కెట్‌కు వచ్చేది. ఈ ఏడాది 200 టన్నులకు మించి రావటం లేదు. చేతికొచ్చిన పంటను మార్కెట్‌కు తీసుకువచ్చేందుకు రైతులు సిద్ధం అయ్యారు. మామిడి కాయల సీజన్ ఆశాజనకంగా ప్రారంభమైనా ఆ ముచ్చట వారం రోజులు కూడా లేకుండా పోయింది. ఊహించని విధంగా వాతావరణంలో మార్పులు సంభవించి అకాల వర్షాలు రావటంతో ఉన్న కాస్త పంటకు డిమాండ్ పడిపోయింది. వర్షానికి తడిసిన కాయలు త్వరగా పాడైపోతాయి. మచ్చలు పడతాయి. ఎక్కువ రోజులు నిల్వ ఉంచే పరిస్థితి ఉండదు. దీంతో పంటను తక్కువ ధరకు తెగనమ్ముతున్నారు. రూ.40వేలు ఉండే టన్ను మామిడి కాయల ధర ఇప్పుడు 20 వేల రూపాయలకు పడిపోయింది. లోడింగ్, అన్‌లోడింగ్, ప్యాకింగ్, రవాణా, స్టోరేజీ చార్జీలు అన్ని కలిపితే సగానికి సగం ధర రాక వ్యాపారులు నష్టపోతున్నారు. అయితే మామిడి చెట్ల పూతమీద ఉన్నప్పుడే వ్యాపారులు ఆయా తోటలను పరిశీలించి రైతులతో కాంట్రాక్టు మాట్లాడుకుని అడ్వాన్సు చెల్లిస్తారు. ఇప్పుడు పూతరాలిపోయి దిగుమతి పడిపోవటంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

వ్యాపారులు తిరిగి వెళ్లిపోతున్నారు: శ్రీనివాసరావు, నున్న మ్యాంగో గ్రోయర్స్ అసోసియేషన్ కార్యదర్శి

ఎంతో ఆశతో మార్కెట్‌కు వస్తున్న వ్యాపారస్తులు కాయ దిగుబడి చూసి వెనక్కు వెళ్లిపోతున్నారు. వాతావరణంలో మార్పులు, భూగర్భజలాలు తగ్గిపోవటంతో కాయల సైజు తగ్గిపోయింది. వర్షానికి తడిసిన కాయలను ప్యాకింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు వెళ్లి వినియోగదారులకు చేరే సరికి పాడైపోతాయి. కొనుగోలు ధర కూడా రాదని వ్యాపారస్తులు సరుకు వదిలేసి వెళ్లిపోతున్నారు. ఈ సంవత్సరం మామిడి రైతులు, వ్యాపారస్తులకు నిరాశే మిగిలింది.

అమరవీరుల ఆశయ సాధనకు పురంకితమవుదాం: దోనేపూడి

విశాలాంధ్ర-విజయవాడ: కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలను తు.చ.తప్పకుండా పాటించి సమసమాజ నిర్మాణం కోసం కృషి చేసిన అమర వీరుల ఆశయాల సాధనకు పునరంకితం అవుదామని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్‌కే.నాసర్ వలి 4వ వర్ధంతి సందర్భంగా కృష్ణలంక చలసాని నగర్‌లోని సిద్దెం కృష్ణారెడ్డి భవన్ వద్ద ఉన్న నాసర్ వలి విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు సంగుల పేరయ్య నిర్వహణలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. సీపీఐ 18వ డివిజన్ కార్యదర్శి అంబటిపూడి మోహన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శంకర్ మాట్లాడుతూ నాసర్ వలి పేద ప్రజల పక్షపాతిగా పని చేశారన్నారు. శ్రామిక వర్గం నుంచి వచ్చిన ఆయన ఆ వర్గం ప్రయోజనాలను కాపాడటం కోసం అహర్నిశలు పని చేశారని కొనియాడారు. నగరంలో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమం సందర్భంగా ఆరున్నరేళ్లు జైలు శిక్ష అనుభవించారని గుర్తు చేశారు. చలసాని వెంకట రత్నం అనుచరుడుగా పార్టీలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. నాసర్‌వలి సేవలను గుర్తించి విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ప్రజలు 26వేల ఓట్ల అత్యధిక మెజార్టీలో ఎమ్మెల్యేగా గెలిపించారని చెప్పారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయాల్లో కులం, మతం, డబ్బు ప్రమేయం ఉండదని, ప్రజల కోసం పనిచేసే వారికి ప్రజాదరణ ఎప్పుడూ ఉంటుంది అనేందుకు నాసర్‌వలి విజయమే ఉదాహరణ అన్నారు. సీపీఐ నేతలు ముందుగా షేక్. నాసర్ వలీ గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, విజయవాడ టాక్స్ సొసైటీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కంచర్ల నాగేశ్వరరావు, మహిళా సమాఖ్య నగర కార్యదరి పంచదార్ల దుర్గాంబ, నగర నాయకులు రాణి, సీపీఐ 17వ డివిజన్ కార్యదర్శి సయ్యద్ సుభాని, సీపీఐ 18వ డివిజన్ సహాయ కార్యదర్శి కూరాకుల స్టాలిన్, మహిళా సమాఖ్య డివిజన్ గౌరవాధ్యక్షురాలు సంగుల విజయకుమారి, 17, 18 డివిజన్‌ల నాయకులు తోట ప్రవీణ్, గుంజా క్రాంతికుమార్, పాశం ఆంజనేయులు, షేక్.నజీర్, గుంజా చిన గోపాలం, ఎస్. అర్జున్‌లతో పాటు పార్టీ సభ్యులు, సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

విశాలాంధ్ర-జగ్గయ్యపేట: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్, డివిఆర్‌నగర్‌లోని సుందరయ్య భవనంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్‌లో సిపిఎం పార్టీ పట్టణ మండల కార్యదర్శి సోమోజు నాగమణి, సుందరయ్య భవన్‌లో సిపిఎం సీనియర్ నాయకులు కోటా కృష్ణ పూలమాలవేసి నివాళులర్పించారు. కోట కృష్ణ మాట్లాడుతూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట వీరుడు, స్వాతంత్ర్య సమర యోధుడు. కమ్యూనిస్టు గాంధీగా పేరొందిన సుందరయ్య తెలుగు నాట కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖుడు అన్నారు. కులవ్యవస్థను నిరసించిన సుందరయ్య అసలు పేరు పుచ్చలపల్లి సుందరరామిరెడ్డి తన పేరులోని రెడ్డి అనే కులసూచికను తొలగించుకున్నాడు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ శాఖ కార్యదర్శి దాసరి నాగేశ్వరరావు, దంతాల వెంకటేశ్వర్లు కోట రవికుమార్, కె శ్రీనివాసరావు, వి వి రాంప్రసాద్, బూచమ్మ, ఎస్ రామనాథం, జె వెంకటరావు, రావేళ్ళ శేషు, బాలు తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో...

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత, స్వాతంత్ర్య సమరయోధుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి వేడుకలు మండలకేంద్రం అయిన పెనుగంచిప్రోలు గ్రామంలో ఆదివారం సిపిఎం పార్టీకార్యాలయం లో మండల కమిటీ సభ్యులు గజ్జి. పెద్దిరాజు. సుందరయ్య చిత్ర పాతంకు పూల మాల లు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు. దార. నాగేశ్వర రావు.సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సిపిఎం నాయకులు. పిడిమర్తి. బాబు. తురక. కొండలు.తదితరులు పాల్గొన్నారు.

వత్సవాయిలో...

విశాలాంధ్ర-వత్సవాయి : వత్సవాయిలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు ఆదివారం రాము అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి తమ్మినేని రమేష్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు మాట్లాడుతూ యువత మరియు సమాజం మహనీయులు సుందరయ్య చూపించిన మార్గంలో నడవడమే మనము ఆయనకిచ్చే ఘన నివాళి అని అన్నారు ఈ కార్యక్రమంలోమండల కమిటీ సభ్యులు మండే పూడి చంద్రశేఖర్, కనకపుడి పటేల్, తమ్మినేని రాంబాబు, పార్టీ సభ్యులు దేవినేని లక్ష్మీనారాయణ, గంగుల వెంకయ్య, వెంకటరత్నం, కూరపాటి వెంకటి, జాను కోటి, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

కంటి క్యాన్సర్ పై అవగాహనకు 'వైట్‌థాన్ వాక్'

విశాలాంధ్ర-విజయవాడ : రెటినోబ్లాస్టోమా అనే కంటి క్యాన్సర్ పై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ (ఎల్వీపీఈఐ) ఆధ్వర్యంలో వైట్‌థాన్ వాక్ పేరుతో ఆదివారం నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయవాడలోని కోడే వెంకటాద్రి చౌదరి క్యాంపస్, తాడిగడప వద్ద ఆసుపత్రి నిర్వాహకులు వైట్‌థాన్ వాక్ ను జెండా ఊపి ఆ ఆసుపత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెటినోబ్లాస్టోమా అనే కంటి క్యాన్సర్ కు సంబంధించి అవగాహన కల్పించుటకు గత రెండు సంవత్స రాలుగా ప్రతి ఏడాది వైట్‌థాన్ పేరిట పరుగు/నడక (రన్నింగ్/వాక్) కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గత దశాబ్దంగా, ఎల్వీపీఈఐ 2500కు పైగా రోగులకు చికిత్స నందించిందన్నారు. అందులో దాదాపు 60-65 శాతం ఉచితం అని, వార్షికంగా సంస్థ 150 నుంచి 200 కొత్త రెటినోబ్లాస్టోమా కేసులకు చికిత్స చేస్తుందన్నారు. సాధారణంగా రెటినోబ్లాస్టోమా అనే కంటి క్యాన్సర్ 3 సంవత్సరాల లోపు వయసున్న పిల్లలను ఎక్కువగా ప్రభావితం చేస్తుందన్నారు. రెటినోబ్లాస్టోమాను ముందుగానే గుర్తించి, చికిత్స చేస్తే, పిల్లల జీవితం, కాంతిని దృష్టిని కాపాడవచ్చుననీ తెలిపారు. ' ఈ వైట్‌థాన్ వాక్ ఎల్ వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వద్ద ప్రారంభించి 5 కి.మీ, 3 కి.మీ నడక కార్యక్రమం రెండు క్యాటగిరులలో నిర్వహించారు.

కౌంటింగ్‌కు ముందస్తు ఏర్పాట్లు

విశాలాంధ్ర-విజయవాడ: కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. జూన్ 4వ తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కింపుకు చేపట్టవలసిన ఏర్పాట్లపై ఆదివారం ఆయన నియోజవర్గ రిటర్నింగ్ అధికారులు, వివిధ శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించామని అదేవిధంగా ఎన్నికల కమిషన్ మార్గదర్శకరాలను పాటిస్తూ లెక్కింపు ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. ఇబ్రహీంపట్నం నోవా, నిమ్రా ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలు, విజయవాడ పార్లమెంటుకు సంబంధించిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరచడం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో నిరంతర నిఘాతో పటిష్టమైన మూడు అంచెల భద్రత ఉందన్నారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లు, సీల్ వేసిన డోర్‌లు, సెక్యూరిటీ, కారిడార్లను నిరంతరం సీసీ కెమెరాల ద్వారా 24 గంటలు పర్యవేక్షించాలన్నారు. గుర్తింపు కార్డులు లేని వ్యక్తులు, అనధికార వ్యక్తులు, ఇతరుల వాహనాలను స్ట్రాంగ్ రూముల పరిసరాలలో ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదన్నారు. స్ట్రాంగ్ రూముల నుండి లెక్కింపు కేంద్రాలకు ఈవీఎంలను తరలించే మార్గాలు, అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లడానికి ప్రత్యేక మార్గాలు ఉండాలన్నారు. బ్యారికెడ్లు, మెష్‌లు, చైర్ల ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపుకు కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, ఇతర లెక్కింపు సిబ్బంది వివరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. లెక్కింపు కేంద్రంలో14 టేబుల్స్ అసెంబ్లీకి, పార్లమెంటుకు 14 టేబుల్స్ చొప్పున 28 టేబుల్స్‌తో పాటు ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ చేపట్టేందుకు ప్రత్యేక టేబుల్స్ ఏర్పాటు ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీ రావు అధికారులను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ ఫుట్కర్, డీఆర్వో వి. శ్రీనివాసరావు, నియోజవర్గ రిటర్నింగ్ అధికారులు ఉన్నారు.

వాహనం ఢీకొని ఏఎస్ఐ మృతి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): ఎన్నికల విధులకు వెళ్తుండగా మృత్యువు రూపంలో వచ్చిన కారు ఏఎస్ఐ ప్రాణాలను బలిగొంది. ఈ దిగ్భ్రాంతికర ఘటన విజయవాడ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం .ఎన్నికల విధులకు హాజరయ్యేందుకు రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. హైవేకి ఆనుకుని ఉన్న సడక్ రోడ్డు వద్ద అధికారులు పోలీస్ బెట్ పోస్ట్ ఏర్పాటు చేశారు. సరిగ్గా ఆ ప్రదేశంలోనే రోడ్డు దాటుతుండగా సీసీఎస్ లో పనిచేస్తున్న ఏఎస్ఐ రమణ మీదకు కారు దూసుకుపోయింది. దీంతో ఏఎస్ఐ రమణ తీవ్రగాయాల పాలయ్యారు. సంఘటన స్థలంలో ఉన్న మిగతా పోలీసులు స్పందించి హుటాహుటాని రమణను విజయవాడలోని ఆంధ్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆయన మృతదేహాన్ని సీపీ రామకృష్ణ సందర్శించి నివాళులు అర్పించారు.

బాటిళ్లలో పెట్రోలు విక్రయిస్తే చర్యలు : సీఐ

విశాలాంధ్ర- కంచికచర్ల: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు బాటిళ్లు, కంటైనర్లలో ఇతర ఏ పద్ధతుల్లో లూజుగా పెట్రోల్ విక్రయించొద్దని పెట్రోల్ బంక్ యజమానులను సీఐ చంద్రశేఖర్ ఆదేశించారు. కంచికచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని పెట్రోల్ బంక్ యజమానులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు లూజు పెట్రోల్ విక్రయించకుండా నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంఘించి నిబంధనలకు విరుద్ధంగా లూజు పెట్రోల్ విక్రయించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎవరైనా కస్టమర్ దారిలో బండి ఆగిపోయిందని బాటిల్ తీసుకువచ్చి పెట్రోల్ కొట్టమంటే బంకు సిబ్బందిని ఇచ్చి కస్టమర్ కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దగ్గరుండి పెట్రోల్ పోసి రావలసిందిగా బంక్ యాజమాను లకు ఆదేశాలు ఇవ్వడమైనది. ఈ సమావేశంలో కంచికచర్ల ఉమెన్ ఎస్సై హైమావతి మరియు కంచికచర్ల మండలం బంక్ యాజమాన్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు భాగస్వాములవుదాం

విశాలాంధ్ర-విజయవాడ: ఎయిడ్స్ వ్యాధిని సమూలంగా రూపుమాపడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాల్సిన అవసరం ఉందని ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయడంతోపాటు ఎయిడ్స్ బాధిత కుటుంబాలకు అండగా ఉందామని జిల్లా రెవెన్యూ అధికారి వి.శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవ సందర్భంగా ఆదివారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి కొవ్వొత్తులను వెలిగించి ఎయిడ్స్ వ్యాధితో మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనలో భాగస్వామ్యులు అవుదామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిని సమూలంగా రూపుమాపడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. హెచ్ఐవీ పై ప్రజలలో అవగాహన కల్పించి నివారణ చర్యలు చేపట్టడమే వ్యాధి నిర్మూలనకు ఎకైక మార్గం అన్నారు. ఎయిడ్స్ వ్యాధితో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ప్రపంచ వ్యాప్తంగా మే నెల 3వ ఆదివారం కొవ్వొతులను వెలిగించి నివాళులు అర్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 17505 మంది హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు వున్నారని వీరిలో సుమారు 1800 కి ప్రతి నెల 2,250 రూపాలయలను ఆర్థిక సహాయం కింద వారి ఖాతాలలో జమ చేస్తున్నామన్నారు. అనంతరం బలమైనా సమాజ నిర్మాణానికి హెచ్ఐవి వ్యాధితో జీవిస్తున్నావారిపట్ల ప్రేమతో సంఘీబావం తెలుపుతానని భాధ్యత కలిగిన పౌరునిగా పరిపూర్ణ చైతన్యం అవగాహనలతో భాధ్యతాయుతమైన ప్రవర్తనతో హెచ్ఐవి /ఎయిడ్స్ వ్యాధిని అరికట్టేందుకు మనసావాచా.. కర్మణతో ముందుంటానని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీపీఎం పి. కిరణ్, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ కో-ఆర్డినేటర్ ఆరవ రమేష్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సమాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

అమెజాన్ ఇండియా ప్రొపెల్ నాల్గవ సీజన్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ(వన్ టౌన్): వినియోగదారుల ఉత్పత్తుల రంగంలో స్టార్టప్ల కోసం గ్లోబల్ బిజినెస్ యాక్సిలరేటర్ అయిన ప్రొపెల్ నాల్గవ సీజన్ ను ప్రారంభించినట్లు అమెజాన్ ఇండియా ప్రకటించింది. అభివృద్ధి చెందుతున్న భారతీయ బ్రాండ్లు, స్టార్టప్ లు ఈ-కామర్స్ ఎగుమతులను ఉపయోగించి ప్రపంచవ్యాప్తంగా కస్టమర్లను చేరుకోవడానికి పూర్తిస్థాయి మద్దతును అందించడానికి తీర్చిదిద్దబడిన వినూత్నమైన ప్రోగ్రామ్ ఇది. ప్రొపెల్ ఎస్4 అంతర్జాతీయ మార్కెట్లలో 50 స్టార్టప్ ప్రారంభానికి మద్దతు ఇస్తుంది. భారతదేశం నుండి గ్లోబల్ బ్రాండ్లను సృష్టించనుంది. దీనిలో పాల్గొనే స్టార్టప్ లు ఏడబ్ల్యూఎస్ యాక్టివేట్ క్రెడిట్లు, ఆరు నెలల ఉచిత లాజిస్టిక్స్, అకౌంట్ మేనేజ్మెంట్ సపోర్ట్, అలాగే టాప్-3 విజేతల కోసం అమెజాన్ నుండి లక్ష డాలర్ల గ్రాంట్ తో సహా 1.5 మిలియన్ డాలర్లకు పైగా విలువైన మొత్తం రివార్డులను గెలుచుకుంటాయి. పాల్గొనే స్టార్టప్ లు భారతీయ ఆదాయ ఆధారిత ఫైనాన్సింగ్ సంస్థలైన క్లబ్, వెలాసిటీ, గెట్ వాన్టేజ్ లతో కనెక్ట్ అవ్వడానికి కూడా అమెజాన్ సహాయం చేస్తుంది. ఇవి పాల్గొనే స్టార్టప్లకు తమ వ్యాపారాన్ని విస్తృత స్థాయిలో విస్తరించడానికి క్యూరేటెడ్ ఆఫర్లను అందిస్తాయని అమెజాన్ ఇండియా గ్లోబల్ ట్రేడ్ డైరెక్టర్ భూపేన్ వాకంకర్ పేర్కొన్నారు.

కుట్టుమిషన్లు పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ: రోటరీ విజయవాడ శ్రీదుర్గా క్లబ్ ఆధ్వర్యంలో మహిళ లకు స్వయం ఉపాధి నిమత్తం కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. రోటరీ జిల్లా 3020 గవర్నర్ రావూరి సుబ్బారావు శ్రీదుర్గా క్లబ్‌ను ఆదివారం సందర్శించి క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను పరిశీలన చేశారు. స్థానిక రోటరీ ఆడిటోరియం, ఈఎస్ఐ హాస్పటల్ వద్ద ఆయనకు క్లబ్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ సభ్యులకు కొన్ని సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా పేద విద్యార్థికి సైకిల్ అందించారు. వాంబేకాలనీలోని మాతృదేవో భవ వృద్ధుల ఆశ్రమానికి 10 ట్రంక్ పెట్టలు అందజేశారు. ఈ కార్యక్రమములో అసిస్టెంట్ గవర్నర్ గొలి రవీంద్ర, జిల్లా కార్యదర్శి భాస్కర్ మలపాక, పీడీజీ జీవీ.రామారావు, క్లబ్ అధ్యక్షుడు కే.విక్రమ్ రెడ్డి, కార్యదర్శి టి.నాగేశ్వర రావు, సభ్యులు పవన్ కుమార్, రవి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

స్లీపర్ స్థానంలో ఎసి-3 ఎకానమీ కోచ్‌లు!

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రానున్న కాలంలో ఎక్స్‌ప్రెస్,సూపర్ ఫాస్ట్ రైళ్లలో మధ్యతరగతి ప్రజలకు సౌకర్యంగా ఉండే స్లీపర్ క్లాస్ కోచ్‌లు కనుమరుగు అయ్యే ప్రమాదం కనబడుతుంది.దూర ప్రాంతాల నుండి వచ్చే రైళ్లకు దాదాపు పది నుండి 12 వరకు స్లీపర్ క్లాస్ కోచ్‌లు ఉండేవి,ఈ మధ్యకాలంలో అందులో నుండి నాలుగు,ఐదు కోచ్‌లు తీసివేసి వాటి స్థానంలో ఏసీ ఎకానమీ పేరుతో ఎమ్ సీరియల్ కోచ్‌లను ప్రవేశపెట్టారు.దీంతో తక్కువ ధరతో మధ్యతరగతి ప్రజలు ప్రయాణించడానికి అనువుగా ఉండే స్లీపర్ కోచ్ ఉండటం లేదు,తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణించవలసిన వారు ఏసీ లో వెళ్ళటానికి ప్రాధాన్యత ఇస్తున్నాడు. ఎసి-3 ఎకానమీ అంటే థర్డ్ ఏసీలో ఉన్నట్లు ఇందులో కూడా అవే కోచ్‌లు ఉంటాయి. థర్డ్ ఏసీలో ప్రయాణికులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తారో ఈ కోచ్‌లోనూ అదే సౌకర్యాలు కల్పిస్తున్నారు. అయితే థర్డ్ ఏసీలో 72 బెర్తులు ఉంటే ఎసి-3 ఎకానమీలో 80 బెర్తులు ఉంటాయి అంటే 8 బెర్తులు పెంచటంతో కోచ్ ఇరుకుగా ఉండటంతో ప్రయాణికులకు సౌలభ్యంగా ఉండటంలేదని చెపుతున్నారు.ముఖ్యంగా దూరప్రాంతాల నుండి ప్రయాణించే వారికి పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉందని వాపోతున్నారు.థర్డ్ ఏసీ కోచ్‌లను సాధారణంగా బి1, బి2, బి3 మొదలైన వాటితో గుర్తించినట్లుగానే ఎకానమీ కోచ్‌లను ఎం1, ఎమ్2, ఎమ్3 మొదలైన వాటితో గుర్తిస్తారు. ఇప్పుడు ఈ కోచ్‌లు చాలా రైళ్లలో ప్రవేశపెట్టారు.గతంలో ఒక రైలులో అధిక శాతం సాధారణ కోచులు ఉండేవి రాను రాను వాటి స్థానంలో స్లీపర్ కోచ్‌లు ఏర్పాటు చేసి ఏసీ కోచ్‌లను మూడు నాలుగు మాత్రమే ఉండేవి, ప్రస్తుతం దానికి భిన్నంగా ఉంటున్నాయి.ఒక రైలు 24 కోచ్‌లతో బయలుదేరితే అందులో రెండు ఎస్ఎల్ఆర్,2 జనరల్ కోచ్‌లు పోగా మిగిలిన 20 కోచ్‌లలో 12 నుండి 13 స్లీపర్ క్లాస్ మిగిలినవి ఎసి కోచ్‌లు ఉంటాయి ప్రస్తుతం కొన్ని ప్రధాన రైళ్ళల్లో స్లీపర్ కోచ్‌లు తగ్గించి వాటి స్థానంలో ఎసి-3 ఎకానమీ కోచ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దీనివలన రైల్వేకు ఆదాయం వస్తుంది తప్పా ప్రయాణికులకు మాత్రం ఇబ్బందులు కలుగుతున్నాయి. రానున్న కాలంలో నూతనంగా ఏ రైలు ప్రవేశపెట్టినా అధిక శాతం ఏసీ కోచ్‌లతో ఏర్పాటు చేసినా ఆశ్చర్యం లేదు. రైల్వే అంటే సాధారణ మధ్యతరగతి ప్రయాణికులకు అతి తక్కువ ధరతో మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా ఉండేది, ప్రస్తుతం దాని అర్థం మారుతున్నట్లు కనబడుతుంది.ముఖ్యంగా గతంలో ఉన్న కేంద్ర ప్రభుత్వాలు సాధారణ ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకునేవారు.ప్రధానిగా మోడీ అయిన తరువాత వికసిత్ భారత్ పేరుతో ఉన్నత శ్రేణి వర్గాలు మాత్రమే దృష్టిలో పట్టుకుని నిర్ణయాలు జరుగుతున్నాయి. రానున్న రోజుల్లో రైలు ప్రయాణం అంటే విమాన ప్రయాణం మాదిరిగా చేసి సాధారణ మధ్య తరగతి వారికి అందని ద్రాక్షగా మారే ప్రమాదం కనబడుతుంది.

భావ సాహిత్య కవి డాక్టర్ ఎస్ఏ రవూఫ్

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్

విశాలాంధ్ర-గుంటూరు : సుప్రసిద్ధ విమర్శకులు సుదర్శనం అన్నట్లు డాక్టర్ రవూఫ్ రచనల్లో పద్య నిర్మాణంలో సహజత్వంతో, రమణీయంగా, ఆలోచనలను రేకిస్తాయని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక బృందావన్ గార్డెన్స్ సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయం ఆవరణలో ప్రముఖ రచయిత డాక్టర్ రవూఫ్ కలం నుంచి జాలువారిన డాక్టర్ కవితా సంపుటి జాబిల్లి పుష్పం పుస్తకావిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొని పుస్తకావిష్కరణ చేసిన డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ కవి తన కవిత్వం ద్వారా తాను చెప్పదలుచుకున్న భావాలను సూటిగా హృదయాలను తాకేటట్లు ఉండాలన్నారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సుప్రసిద్ధ కవి డాక్టర్ ఇస్మాయిల్ వారసునిగా గత నాలుగు దశాబ్దాలుగా సాహితీ ప్రస్థానంలో డాక్టర్ రవూఫ్ ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు. ప్రముఖ రచయిత కాట్రగడ్డ దయానంద్ మాట్లాడుతూ తన కలం ద్వారా కవిత్వాన్ని సృష్టిస్తే అది రసజ్ఞుల హృదయాల లోతులను సృజిస్తాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ చిల్లర భవానీ దేవి మాట్లాడుతూ కవితా సంపుటి జాబిల్లి పుష్పంలో జాబిల్లి అనేకానేక శాఖల పుష్పంగా మారి గుబాళిస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలపాక ప్రకాష్, కార్యదర్శి ఎస్ఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.